హైడ్రా బాధితులకు అండగా నిలవండి..

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బుధవారం ఆ పార్టీ నాయకుడు కొమ్ముల నరేందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైడ్రా బాధితులకు అండగా నిలవాలని కేటీఆర్‌ను కోరారు.

– అబిడ్స్, అక్టోబర్ 16

ట్యాంక్‌బండ్‌పై కేవీ కేశవులు విగ్రహం ఏర్పాటు చేయాలి

మాజీ మంత్రి కేవీ కేశవులు విగ్రహం ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని బుధవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కాంగ్రెస్ ఓబీసీ సెల్ నాయకుడు పొల్కం శ్రీనివాస్, ఆదిమూలం శంకర్ తదితరులు వినతిపత్రం అందజేశారు.

– అబిడ్స్, అక్టోబర్ 16

ముత్యాలమ్మ ఆలయంలో శాంతి హోమం

మారేడ్‌పల్లి, అక్టోబర్ 16: సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయంలో బుధవారం కలశస్థాపన, శాంతి, చండీ హోమాలు జరిగాయి. కార్పొరేటర్ కొంతం దీపిక, కంటోన్మెంట్ బీజేపీ నాయకుడు వంశా తిలక్ ఆలయం ముందు మౌనదీక్ష చేశారు. జనసేన పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్‌గౌడ్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ముత్యాలమ్మ ఆలయాన్ని సందర్శించారు.

ఉత్తమ సేవలందించడమే లక్ష్యం

- ఆర్టీసీ డీఆర్ఎం జగన్
- ఆదాయార్జనలో కాచిగూడ డిపో రాష్ట్రంలోనే 3వ స్థానం
- సిబ్బంది సంబురాలు

ఆర్టీసీ కాచిగూడ డిపోలో సిబ్బందికి పండ్లు తినిపించి సంబురాలు జరుపుకుంటున్న డిప్యూటీ రీజినల్ మేనేజర్ జగన్, డిపో మేనేజర్ రఘు, సిబ్బంది

కాచిగూడ, అక్టోబర్ 16: ఉద్యోగులు, కార్మికుల సమష్టి కృషితోనే సంస్థ లాభాల బాటలో పయనిస్తున్నదని ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ జగన్ అన్నారు. దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ ప్రయాణికులకు ఉత్తమ సేవలందించడం, టార్గెట్‌కు మించి ఆదాయాన్ని సాధించడంలో రాష్ట్రంలోనే కాచిగూడ డిపోకు 3వ స్థానం దక్కింది. ఈ సందర్భంగా బుధవారం కాచిగూడ ఆర్టీసీ డిపో ఆవరణలో డిపో మేనేజర్ టి.రఘు ఆధ్వర్యంలో కండక్టర్లు, డ్రైవర్లు, మెకానికల్ సిబ్బంది సంబురాలు జరుపుకున్నారు. సిబ్బందికి పండ్లు పంపిణీ చేశారు. అనంతరం డీఎం మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తూ సంస్థకు ఆదాయాన్ని సమకూర్చడానికి విశేషంగా కృషి చేస్తున్నామన్నారు. బ్రేక్ డౌన్స్ తగ్గించి, జీరో పర్సంటేజీకి తీసుకురావడానికి సిబ్బందితో కలిసి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులకు మరిన్ని సేవలందించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, వాసవి, అయోధ్యరాములు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజలకు అన్ని వేళల్లో అందుబాటులో ఉంటూ అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. బుధవారం మెహిదీపట్నం, అహ్మద్‌నగర్, మల్లేపల్లి ప్రాంతాల ప్రజలు ఎమ్మెల్యేను కలిసి బస్తీల్లో సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు.

– మెహిదీపట్నం, అక్టోబర్ 16

కార్వాన్ ఎమ్మెల్యేకు ఘనసన్మానం

ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్‌ను సన్మానిస్తున్న లంగర్‌హౌస్ దసరా ఉత్సవ సమితి ప్రతినిధులు

మెహిదీపట్నం అక్టోబర్ 16 : దసరా ఉత్సవాలను బస్తీలు, కాలనీల్లో యువత ఐక్యంగా నిర్వహించుకోవడం అభినందనీయమని కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. బుధవారం లంగర్ హౌస్ దసరా ఉత్సవ సమితి అధ్యక్షుడు బోగి బాల్‌రాజ్,ప్రధాన కార్యదర్శి గౌతమ్ అనిల్ కుమార్,కోశాధికారి పి. శ్రీనివాస్ కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్, నానల్‌నగర్ కార్పొరేటర్ నసీరుద్దీన్,ఎంఐఎం నాయకులు మహ్మద్ హరూన్ ఫర్హాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పండుగలను ప్రశాంతంగా జరుపుకోవడంలో యువత కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు.

చట్ పూజలకు సహకరించాలనివినతి

కార్వాన్ : నవంబర్ మొదటి వారంలో నిర్వహించే చట్ పూజా 20వ వార్షికోత్సవాలకు సహకరించాలని కోరుతూ బుధవారం చట్ పూజా సమితి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్‌తోపాటు కార్వాన్ బీఆర్ఎస్ నాయకుడు మంగి కిశోర్ తదితరులు కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నవంబర్ 7,8 తేదీల్లో లంగర్‌హౌస్ బాపూఘాట్‌లోని తపోవన్‌పార్క్‌లో చట్ పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ పూజలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతారని, ఎటు వంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరినట్లు వివరించారు.

అలరించిన 'చెంచులక్ష్మి-నరసింహుడి కల్యాణం'

రవీంద్రభారతి, అక్టోబర్ 16 : కళాకృతి నృత్యాలయ 11వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో నిర్వహించిన చెంచులక్ష్మి-నరసింహుడి కల్యాణ నృత్య రూపకం అలరించింది. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా కూచిపూడి కేరళ ఎక్స్‌పోనెంట్ అనుపమ మోహన్, డీజీ రాజబాబు, డీఆర్డీవో సౌత్ హెడ్ మీల యాదయ్య, డీఆర్డీవో విశ్రాంత శాస్త్రవేత్త కె. రాంబాబు, తెలంగాణ కూచిపూడి ఎక్స్‌పోనెంట్ సుధీర్‌రావు, రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. నరసింహుడి ఉగ్రరూపాన్ని ఈ రూపకంలో కండ్లకు కట్టారని అన్నారు. పౌరాణిక, సాంస్కృతిక శాశ్వత వారసత్వానికి ఈ రూపకం నిదర్శనంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో డాన్స్ ఇండియా సంపాదకులు విక్రమ్ కుమార్, కళాకృతి నృత్యాలయ వ్యవస్థాపకులు భారతి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నగర కార్యదర్శిగా మోజస్

ముషీరాబాద్, అక్టోబర్ 16: బీఆర్ఎస్ నగర కార్యనిర్వాహక కార్యదర్శిగా రాంనగర్ డివిజన్ రావులపాటి మోజస్ నియమితులయ్యారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మోజస్ ఇదివరకు బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా, డివిజన్ అధ్యక్షుడిగా పని చేశారు. ఈ సందర్భంగా మోజస్ మాట్లాడుతూ అన్ని వర్గాలను కలుపుకొని పార్టీ పట్టితకు కృషిచేయనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయడంతోటు ప్రజల పక్షాన, సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని అన్నారు. తనను నగర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించినందుకుగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సేవా భావంతో పనిచేసినప్పడే గుర్తింపు

నెహ్రూనగర్‌లో అన్నదానం చేస్తున్న విశ్రాంత లేబర్ అఫీసర్ కాలేరు వెంకటేశం, కాలేరు రామకృష్ణ, తదితరులు

కాచిగూడ,అక్టోబర్ 16: సేవా భావంతో పనిచేసినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ మానవత దృక్పథంతో ముందుకు సాగాలని మాజీ సర్పంచ్ రఘురామయ్య అన్నారు. గోల్నాక డివిజన్ బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు కాలేరు రామకృష్ణ ఆధ్వర్యంలో విశ్రాంత లేబర్ అఫీసర్ కాలేరు వెంకటేశం 80వ జన్మదినాన్ని పురస్కరించుకుని నెహ్రూనగర్‌లో అన్నదానం, పేదలకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. విద్యార్థులకు నోట్స్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రఘురామయ్య మాట్లాడుతూ.. యువత సరైన మార్గంలో పయణిస్తూ ప్రజలకు సేవలందించే లక్ష్యంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సంతోశ్, రాఘవ, శ్రీకాంత్, నర్సింగ్‌రావు, పెంటం కిషన్, భరత్‌రాజ్ ముదిరాజ్, కాలేరు రాజు, రాజన్, బాచి, అప్ప శ్రీను, మైఖేల్, తదితరులు పాల్గొన్నారు.

రూ.45 లక్షలతో వరద నీటి కాల్వల పునర్నిర్మాణం

వెంగళరావునగర్, అక్టోబర్ 16 : రూ.45 లక్షల వ్యయంతో వెస్ట్ శ్రీనివాస్ నగర్ కాలనీలో వరదనీటి కాలువ పునర్నిర్మాణ పనులు, కొత్త పైపులైన్ పనులు చేపట్టినట్లు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తెలిపారు. బుధవారం సోమాజిగూడ డివిజన్ వెస్ట్ శ్రీనివాస్ నగర్ కాలనీ నుంచి మైత్రివనం వరకు సీవరేజీ వరద నీటి కాలువ పునర్నిర్మాణం పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే గోపీనాథ్ మాట్లాడుతూ.. పెరిగిన జనాభాకు అనుగుణంగా పైపులైన్ల సామర్థ్యాన్ని పెంపొందించి పనులు చేపట్టామని పేర్కొన్నారు. వెస్ట్ శ్రీనివాస్ నగర్ కాలనీ, అమీర్‌పేట వాసులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధులు వెచ్చిస్తామని పేర్కొన్నారు. దీర్ఘకాలం నాటి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్న ఎమ్మెల్యే మాగంటికు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ కృష్ణ చైతన్య, ఏఈ భరత్, కాలనీ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్‌రావు,రవీంద్ర, జహీర్, కవిత డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లికార్జుననగర్‌లో కార్పొరేటర్ పర్యటన

డ్రైనేజీ సమస్యను తెలుసుకుంటున్న కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి

అంబర్‌పేట, అక్టోబర్ 16 : బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి బుధవారం మల్లికార్జుననగర్‌లో పర్యటించారు. గత కొన్ని రోజులుగా డ్రైనేజీ పూర్తిగా నిండిపోయి తాగునీరు కలుషితమవుతుందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఆమె బస్తీలో పర్యటించి సమస్యను పరిశీలించారు. డ్రైనేజీలో పూడిక నిండి ఉండటాన్ని గమనించి దగ్గరుండి సిబ్బందితో పూడికను తీయించారు. గురువారం సైతం సంబంధిత వాటర్‌వర్క్స్ అధికారులను తీసుకొని బస్తీకి వస్తానని చెప్పారు.

మల్లేపల్లిలో దోమల నివారణ చర్యలు

నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్‌లో దోమల నివారణకు జీహెచ్ఎంసీ మలేరియా విభాగ అధికారులు బుధవారం చర్యలు చేపట్టారు. మురికి నీరు నిల్వ ఉండే పలుచోట్ల దోమల లార్వా పెరగకుండా రసాయనాలను పిచ్‌కారీ చేశారు. పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సర్కిల్-12 డిప్యూటీ కమిషనర్ నాగేశ్వర్‌రావు ప్రజలకు సూచించారు.

– మెహిదీపట్నం అక్టోబర్ 16

మరిన్ని గోశాలలు ఏర్పాటు చేయాలి

గోవుకు మేత అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు బిల్డర్ ప్రవీణ్, తదితరులు

కాచిగూడ, అక్టోబర్ 16: ప్రస్తుతం ఆలయాల్లో ప్రసాదాలు తీసుకోవాలంటేనే భక్తులు ఆందోళన చెందుతున్నారని సంఘసేవకుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బిల్డర్ ప్రవీణ్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం బిల్డర్ ప్రవీణ్ గోవులకు పశుగ్రాసం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛమైన ఆవు పాలు, పెరుగు, నెయ్యితో చేసిన పదార్థాలను దేవుళ్లకు నైవేద్యంగా పెట్టాలంటే గోశాలల ఏర్పాటుతోనే సాధ్యమవుతుందన్నారు. ఆయన వెంట సాయిలు పాల్గొన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా స్లమ్ సెల్ కన్వీనర్‌గా సుభాష్

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర స్లమ్ సెల్ కన్వీనర్‌గా నాంపల్లి నియోజకవర్గం రెడ్‌హిల్స్ డివిజన్‌కు చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకుడు బండారి సుభాష్ కుమార్‌ను నియమించారు. ఈమేరకు బుధవారం ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ సుభాష్‌కుమార్‌కు నియామకపత్రం అందజేశారు.

– మెహిదీపట్నం, అక్టోబర్ 16

గుర్తుతెలియని వృద్ధుడు మృతి

కాచిగూడ, అక్టోబర్ 16: రైల్వే ప్లాట్‌ఫామ్‌పై అనారోగ్యంతో గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. ఈ సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 60 ఏండ్ల వయసున్న గుర్తుతెలియని వృద్ధుడు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శివరాంపల్లి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్-2 చివర్లో ఉంటూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడు నీలి రంగు చొక్కా, గోధుమ రంగు ప్యాంట్ ధరించి, 5.3 అడుగుల ఎత్తు ఉన్నట్లు పేర్కొన్నారు. కాచిగూడ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

మాదాపూర్, అక్టోబర్ 16: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని ఏఐఎస్ఎఫ్ శేరిలింగంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు ధర్మతేజ నితీశ్ అన్నారు. డిగ్రీ కళాశాల యాజమాన్యాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరవధిక బంద్‌కు ఏఐఎస్ఎఫ్ పూర్తి మద్దతు ఇస్తుందని తెలియజేస్తూ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిగ్రీ కళాశాల యాజమాన్యాలతో ప్రభుత్వం చర్చలు జరిపి ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించలేని యెడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 2వేల మంది విద్యార్థులతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ముట్టడికి పిలుపునిస్తామన్నారు. డిగ్రీ కళాశాల యాజమాన్యాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరవధిక బంద్‌కు ఏఐఎస్ఎఫ్ పూర్తి మద్దతు అందిస్తుందన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 8వేల కోట్ల స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యార్థులకు ఒకే దఫాలో స్కాలర్‌షిప్స్, రీయింబర్స్‌మెంట్స్ వేస్తామని చెప్పి విద్యార్థులను మోసగిస్తున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వం తీరుమార్చుకొని విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని, లేదంటే విద్యార్థులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

కాలనీల్లో సమస్యలు పరిష్కరించండి

- బీఆర్ఎస్ నాయకుడు ఎం. ఆనంద్‌కుమార్‌గౌడ్

జీహెచ్ఎంసీ సర్కిల్-14 డీఎంసీకి సమస్యలను విన్నవిస్తున్న బీఆర్ఎస్ గోషామహల్ నాయకుడు ఎం. ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్, అక్టోబర్ 16 : గోషామహల్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని బీఆర్ఎస్ నాయకుడు ఎం. ఆనంద్‌కుమార్ గౌడ్ కోరారు. ఈ మేరకు బుధవారం జీహెచ్ఎంసీ సర్కిల్-14 డీఎంసీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. జుమ్మెరాత్ బజార్, ధూల్‌పేట్ బస్తీల్లో మౌలిక సదుపాయాలు సరిగా లేవన్నారు. అంతేకాకుండా డ్రైనేజీ నీరు రోడ్లపై పారుతూ దుర్గంధం వ్యాపిస్తుండటంతో భరించలేకపోతున్నారని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో మెరుగైన రోడ్లు ఏర్పాటు చేసి, విద్యుత్ సరఫరా, తాగునీరు కలుషితం కాకుండా చూడాలని ఆయన డీఎంసీకి విన్నవించారు. డ్రైనేజీ పొంగకుండా అంతర్గత డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాసింగ్, శైలేందర్‌సింగ్, చంద్రప్రకాశ్‌సింగ్, సురేందర్‌సింగ్, కిరణ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

పుప్పాలగూడలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్, కౌన్సిలర్

మణికొండ, అక్టోబర్ 16 : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీలో 18వ వార్డులో కౌన్సిలర్ పురుషోత్తంతో కలిసి రూ.50 లక్షలతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. మణికొండ మున్సిపాలిటీని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, డీఈఈ శివసాయి, ఏఈ సంజయ్‌కుమార్, స్థానికులు పాల్గొన్నారు.

'మానవ అక్రమ రవాణాను అరికట్టాలి'

మణికొండ, అక్టోబర్ 16 : మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు బాధ్యతాయుతంగా కృషి చేయాలని నార్సింగి మున్సిపల్ కౌన్సిలర్ ఉషారాణి అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నార్సింగి మున్సిపల్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి కౌన్సిలర్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ప్రజ్వల స్వచ్ఛంద వ్యవస్థాపకురాలు పద్మశ్రీ డాక్టర్ సునీత కృష్ణన్, సంస్థ కో - ఆర్డినేటర్ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ.. సంస్థ ద్వారా 28 ఏండ్ల నుంచి అనేక కార్యక్రమాలు చేపట్టి అవగాహన కల్పిస్తున్నామన్నారు. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా సంబంధిత అన్నిశాఖల సహకారంతో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ అందించి గ్రామాల్లో కూడా కార్యక్రమాలను నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. శిక్షణలో భారతీయ న్యాయ సంహిత, బాల్య వివాహాల నిషేధ చట్టం, టోల్ ఫ్రీ నంబర్స్ 1098 (చైల్డ్ లైన్),100 (పోలీస్),181 (మహిళా హెల్ప్ లైన్),1930 (సైబర్ క్రైం), సైబర్ వెబ్‌సైట్ల ద్వారా ఏవిధంగా ఫిర్యాదు చేయాలో నేర్చుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కోమలి,జ్యోతి, ప్రజ్వల ప్రతినిధులు అంబర్‌సింగ్, చెన్నకేశవ్, జిల్లా కోఆర్డినేటర్ శ్రీకాంత్, అశ్రిత, ఎన్జీవో ప్రతినిధి ఉమామహేశ్వరి, అంగన్‌వాడీ టీచర్ సుధారాణి పాల్గొన్నారు.

పుట్‌పాత్‌ను ఆక్రమిస్తే కఠిన చర్యలు

ఖైరతాబాద్, అక్టోబర్ 16 : పుట్‌పాత్‌ను ఆక్రమిస్తే కఠినచర్యలు తప్పవని ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్ అన్నారు. బుధవారం అమీర్‌పేట నుంచి పంజాగుట్ట వై - జంక్షన్ వరకు పుట్‌పాత్ ఆక్రమణలను డీపీసీ బీకే రాహుల్ హెగ్డే, ఏసీపీ హరిప్రసాద్, ఇన్‌స్పెక్టర్ బోసుకిరణ్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం సిబ్బందితో ఆక్రమణలను తొలగింపచేశారు. మీడియాతో మాట్లాడుతూ.. అమీర్‌పేట, అమీర్‌పేట నుంచి పంజాగుట్ట వై - జంక్షన్, అక్కడి నుంచి గ్రీన్‌ల్యాండ్స్ వరకు కొందరు వీధి వ్యాపారులు పుట్‌పాత్‌లను ఆక్రమించుకొని వ్యాపారాలు చేసుకుంటున్నారని అన్నారు. వారి వల్ల పాదచారులకు నడిచే దారి లేక ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఆక్రమణలను నిరోధించేందుకే క్లియరెన్స్ డ్రైవ్ చేస్తున్నామన్నారు.

ఆకట్టుకున్న పద్య నాటకోత్సవాలు

ముషీరాబాద్, అక్టోబర్ 16: ఆరాధన కల్చరల్ అసోసియేషన్ బుధవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో నిర్వహించిన పద్య నాటకోత్సవాలు పలువురి అకట్టుకున్నాయి. 'యుద్ధం-తథ్యం' పౌరాణిక పద్య నాటకం పలువురిని రంజింపజేసింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సాహితీవేత్త డాక్టర్ ఎంకే రాము పాల్గొని కళాకారులను సత్కరించారు. ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లంక లక్ష్మీనారాయణ, ఉమర్‌ఖాన్, వెంకట్‌రావు, జోన్నలగడ్డ శ్రవణ్‌కుమార్, టి. రాజబాబు, పిల్లుట్ల లక్ష్మీకాంతశర్మ, ఆరాధన కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు లోకం కృష్ణయ్య, రమణాచారి పాల్గొన్నారు.

రెండు కోట్ల మంది బీసీలున్నా సీఎం పదవికి నోచుకోలేదు..



మాట్లాడుతున్న బీసీ కులాల ఐక్యవేదిక జాతీయ గౌరవాధ్యక్షుడు నరహరి

ఖైరతాబాద్, అక్టోబర్ 16 : రాష్ట్రంలో రెండు కోట్లకు పైగా బీసీ వర్గాలున్నా సీఎం పదవికి నోచుకోవడం లేదని బీసీ కులాల ఐక్యవేదిక జాతీయ గౌరవాధ్యక్షుడు డి.నరహరి అన్నారు. లక్డీకాపూల్‌లోని హోటల్ సెంట్రల్ కోర్టులో ఐక్యవేదిక అధ్యక్షుడు పాండు యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా నరహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలు తమ హక్కుల కోసం అడుక్కొవాల్సిన పరిస్థితి నెలకొందని, బీసీలందరూ ఒకే తాటిపైకి వచ్చి తమ హక్కులు, రాజ్యాధికారాన్ని సాధించుకోవాలన్నారు. బీసీ విద్యావంతులు చురుకైన పాత్ర పోషించాలని, రాజకీయంగా బలంగా నిలబడానికి సూచించారు. తమతో కలిసి వచ్చే సామాజిక శక్తుల పునరేకీకరణ జరుగాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు పోటీలో నిలబడానికి ఉద్యమ రాజకీయ వ్యవస్థ నిర్మాణం చేయాలని, జిల్లాల్లో ఆ వర్గాలన్నీ ఏకతాటిపైకి వచ్చి రాజకీయ సదస్సులు నిర్వహించి చైతన్యాన్ని నింపాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు డాక్టర్ వినయ్ కుమార్, ఎర్ర సత్యనారాయణ, సి. అశోక్ కుమార్, డి. శంకరన్న, జగన్‌మోహన్ ముదిరాజ్, నిమ్మల వీరన్న, బత్తుల సిద్ధేశ్వర్, శ్రీనివాస్ యాదవ్, మినగ గోపి, సంధ్యారాణి, తమ్ముల చెన్నయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.